# కందిలి

www.kandilinews.com

న్యూస్.. దారిచూపే దీప శిఖ

ఆదివారం | 29.03.2026 సంపుటి: 01 | సంచిక: 231 | వెల: రూ. 4 /- TGTEL/25/A 1800





మీ ప్రాంతంలోని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదా? అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం కనిపించడం లేదా? ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారా?.. ఇలాంటి సమస్యలు ఏవైనా సరే.. 'కందిలి' దృష్టికి తీసుకురండి.

**70365 45130**

నంబరుకు వాట్సాప్ చేసి వివరాలు అందించండి. అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా కథనాలు అందించి, సమస్యల పరిష్కారానికి మా బాధ్యతగా కృషి చేస్తాం.

ఇట్లు.. టీం కందిలి




## సంగారెడ్డి రాజీవ్ పార్క్‌లో...
## స్విమ్మింగ్ పూల్ ప్రారంభించిన
## టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి!

- ఈ కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ మాధురి , మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్

సంగారెడ్డి పట్టణంలోని రాజీవ్ పార్క్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గా రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) మాధురి, సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్ పాల్గొన్నారు

3 లో





## కట్టుకున్నోడు దూరమై..
## బతుకే భారమని కుంగిపోయి!

- ఇద్దరు పిల్లలను గొంతు నులిమి చంపేసిన తల్లి
- తాను ఉరి వేసుకొని తనువు చాలించిన తీరు
- కంది మండలం జుల్కల్ గ్రామంలో దారుణం
- ఘటనాస్థలిని పరిశీలించిన ఎస్పీ పరితోష్ పంకజ్

2 లో

## బీఆర్ఎస్ పార్టీకి..
## తెలంగాణ ప్రజలు
## సీఆర్ఎస్ ఇస్తారు!

- ఆ పార్టీ నాలుగు ముక్కలై, ప్రజాక్షేత్రం నుంచి వైదొలుగుతుంది
- కవిత పార్టీ పెడతారని నేను చెప్పిన జోష్యం నేడు నిజమైంది
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదు... రెండూ ఒక్కటే
- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు కామెంట్స్



4 లో





# కట్టుకున్నోడు దూరమై.. బతుకే భారమని కుంగిపోయి!



- ఇద్దరు పిల్లలను గొంతు నులిమి చంపేసిన తల్లి
- తానూ ఉరి వేసుకొని తనువు చాలించిన తీరు
- కంది మండలం జుల్కల్ గ్రామంలో దారుణం
- ఘటనాస్థలిని పరిశీలించిన ఎస్పీ పరితోష్ పంకజ్

**కందిలి, సంగారెడ్డి**

కడదాకా తోడుంటాడని బాస చేసిన భర్త హఠాన్మరణం చెందాడు. ఇద్దరు పిల్లలు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. తీవ్ర మనస్థాపానికి గురైంది. ఇలాంటి స్థితిలో జీవితంపై ఆశలు వదులుకుంది ఆ ఇల్లాలు. భర్త లేని లోకంలో బతకలేనని భావించింది. ఇద్దరు పిల్లలను చంపేసి, తానూ బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాద ఘటన సంగారెడ్డి జిల్లా కంది మండలం జుల్కల్ గ్రామంలో చోటు చేసుకుంది.

**రోడ్డు ప్రమాదంలో...ప్రవీణ్ మృతి!**

కంది మండలం జుల్కల్ గ్రామానికి చెందిన పట్నం ప్రవీణ్ కు భార్య మమత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ పరిణామంతో ఆమె మానసికంగా కుంగిపోయింది. జీవితంపై ఆశలు వదులుకుంది. బతుకే భారమని భావించింది. ఈ క్రమంలో పిల్లలు మణికంఠ, ప్రళయను గొంతు పిసికి చంపేసింది. ఆ తర్వాత దూలానికి చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనతో జుల్కల్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**ఘటనాస్థలికి..**
**ఎస్పీ పరితోష్ పంకజ్!**

ఈ విషయం తెలుసుకున్న వెంటనే సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ జుల్కల్ గ్రామానికి వచ్చారు. డీఎస్పీ సత్తయ్య గౌడ్ తో కలిసి ఘటనాస్థలిని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం సిబ్బంది వివరాలు, ఆధారాలు సేకరించారు. ఈ తరహా సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రజలు సమస్యలను ఒంటరిగా భరించకుండా, కుటుంబ సభ్యులు లేదా సన్నిహితులతో పంచుకోవాలని ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి కారణాలు తెలుసుకునేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

**కష్టాల్లో ఉన్నవారికి...**
**భరోసా దక్కకపోవడంతోనూ!**

అత్యంత కష్టాల్లో ఉన్నవారికి ఆ సమయంలో మనోధైర్యం ఇచ్చే వారు కావాలి. మేమున్నాం, కష్టాలు కలకాలం ఉండవనే ధైర్యాన్ని వారిలో కల్పించగలగాలి. కానీ చాలా ఘటనల్లో ఈ భరోసా దక్కడం లేదు. దీంతో కష్టాల్లో ఉన్న వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారు, మానసికంగా కుంగిపోతున్న వారికి తామున్నామని బంధువులు, స్నేహితులు ముందుకొచ్చి అండగా నిలిచే ప్రయత్నం చేస్తే కొందరి ప్రాణాలనైనా కాపాడొచ్చు.

---



# ఇండియన్ ఆర్మీలో చేరండి.. దేశరక్షణలో భాగస్వాములుకండి!

- అగ్నివీర్ నియామకాల కోసం –2027 రిక్రూట్మెంట్
- అర్హులైన యువత ఈ అవకాశాన్ని... సద్వినియోగం చేసుకోవాలన్న ఎస్పీ పరితోష్ పంకజ్

**కందిలి, సంగారెడ్డి**

భారత సైన్యంలో అగ్నివీర్ నియామకాల కోసం 2027 సంవత్సరానికి సంబంధించిన రిక్రూట్ మెంట్ నోటిఫికేషన్ విడుదలైందని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగి, అర్హులైన యువత ఇండియన్ ఆర్మీ అధికారిక వెబ్ సైట్ జాయిన్ ఇండియన్ ఆర్మీ పోర్టల్ (www.joinindianarmy.nic.in) ద్వారా ఫిబ్రవరి 2026 నుంచి 01 ఏప్రిల్ 2026 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు.

**ఎస్పీ పరితోష్ పంకజ్**
**సూచనలు ఇలా!**

- అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే ముందు అధికారిక నోటిఫికేషన్‌ను పూర్తిగా చదవాలి. అవసరమైన పత్రాలు సిద్ధం చేసుకోవాలి. ఎంపిక ప్రక్రియలో రాత పరీక్ష, శారీరక సామర్థ్య పరీక్షలు, వైద్య పరీక్షలు వంటి దశలు ఉంటాయి.
- అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దేశ సేవలో భాగస్వాములు కావాలి. యువత శారీరక దారుఢ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. నిత్య వ్యాయామం, పరుగు, ఆరోగ్యకరమైన ఆహారం అలవాటు చేసుకోవాలి.

**విద్యార్హతలు:**

- అభ్యర్థులు 10వ తరగతి / మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణత సాధించి ఉండాలి.
- 5 ప్రధాన విషయాలలో మొత్తం 45% మార్కులు ఉండాలి.
- ప్రతి విషయానికి కనీసం 33% మార్కులు తప్పనిసరి.

**అర్హతలు:**

- వయస్సు: 17½ నుండి 22 సంవత్సరాల మధ్య ఉండాలి.
- ఎత్తు: ప్రాంతానుసారం నిర్దేశిత ప్రమాణాలు వర్తిస్తాయి.
- ఛాతి కొలత: కనీసం 77 సెం.మీ (విస్తరణతో 82 సెం.మీ వరకు).



# సంగారెడ్డి రాజీవ్ పార్క్‌లో...
# స్విమ్మింగ్ పూల్ ప్రారంభించిన
## టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి!





- **ఈ కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ మాధురి మున్సిపల్ ఛైర్ పర్సన్ కూన వనితా సంతోష్**

**కందిలి, సంగారెడ్డి**

సంగారెడ్డి పట్టణంలోని రాజీవ్ పార్క్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గా రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) మాధురి, సంగారెడ్డి మున్సిపల్ ఛైర్ పర్సన్ కూన వనిత సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రాజీవ్ పార్క్ పక్కన ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడాభివృద్ధిలో భాగంగా సుమారు రూ. 20 లక్షల వ్యయంతో ఈ పూల్‌ను పునరుద్ధరించినట్లు తెలిపారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడానికి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడానికి ఇటువంటి సదుపాయాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పిల్లల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో స్విమ్మింగ్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈత ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తుందని వివరించారు. స్పోర్ట్ అథారిటీ జిల్లా అధికారి అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ స్విమ్మింగ్ పూల్‌ను పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంచుతూ నెలవారీ, మూడు నెలలు, ఆరు నెలల కార్డుల రూపంలో రేట్లు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి వయస్సు వారికి అనుకూలంగా సమయాలను కూడా కేటాయించినట్లు వెల్లడించారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో సంగారెడ్డి ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లలు, యువత ఈ విషయాన్ని గమనించాలన్నారు. స్విమ్మింగ్ ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు క్రీడా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, క్రీడా విభాగం సిబ్బంది, కౌన్సిలర్లు శ్రీకాంత్ , రమేష్ తదితరులు పాల్గొన్నారు.







# బీఆర్ఎస్ పార్టీకి..

# తెలంగాణ ప్రజలు సీఆర్ఎస్ ఇస్తారు!

- ఆ పార్టీ నాలుగు ముక్కలై, ప్రజాక్షేత్రం నుంచి వైదొలుగుతుంది
- కవిత పార్టీ పెడతారని నేను చెప్పిన జోష్యం నేడు నిజమైంది
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదు... రెండూ ఒక్కటే
- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు కామెంట్స్

**కందిలి, సంగారెడ్డి**

"కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెడతారని నేను ఏడాది క్రితమే చెప్పాను. కానీ కొందరు రఘునందన్ జ్యోతిష్యం చెబుతున్నారా? అంటూ అడిగారు. కానీ నేను చెప్పిన జోష్యమే ఈ ఉగాది రోజున నిజమైనట్లుంది. ఆమె పార్టీ పెడితే స్వాగతిస్తాం" అంటూ మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా జనరల్ ఆస్పత్రికి వచ్చిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.



**రాజకీయ పార్టీ పెట్టుకునే హక్కుంది!**

"కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీ పెడతారని నేను ఏడాది క్రితమే చెప్పాను. దేశంలో 6,201 పార్టీలు ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్ అయ్యాయి. కొత్తగా పార్టీ పెడుతున్న కవితను స్వాగతిస్తున్నాం. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా రాజకీయ పార్టీ పెట్టుకునే హక్కు ఉంటుంది.

ఒక్కసారి అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ నాలుగు ముక్కలు అవుతుందని, ఆ ముక్కలేవి వచ్చే ఎన్నికల వరకు నిలబడవని చెప్పాను. అదే ఇప్పుడు నిజమవుతోంద"ని ఎంపీ రఘునందన్ రావు అన్నారు.

**నేను మళ్లీ చెబుతున్నాను!**

"నేను మళ్లీ చెబుతున్న. బీఆర్ఎస్ నాలుగు ముక్కలు అవుతుంది. వచ్చే ఎన్నికల వరకు బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల చేత సీఆర్ఎస్ (కంపల్సరీ రిటైర్ మెంట్ స్కీం) తీసుకుంటుంది. ప్రజాక్షేత్రం నుంచి బయటకు వెళ్తుంది. ఎలిమినేట్ అవుతుంది. ప్రజలారా ఒక్కసారి ఆలోచించండి. బీఆర్ఎస్ పార్టీ కేవలం ప్రచార ఆర్భాటాలకు, వాళ్ల దగ్గరున్న డబ్బులను కాపాడుకోవడానికి, మీడియా ఈవెంట్ చేస్తోంది. పదేళ్ల పాలనలో వారు చేసిన తప్పులన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం క్షమిస్తూ, ఉదార స్వభావంతో నటిస్తోంది. చివరకు వారిద్దరు ఒక్కటయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదు. ఈ రెండు పార్టీల నేతలు కలిసి పోటీచేస్తారు. కలిసి కొట్లాడుతారు. నాణేనికి ఉన్న బొమ్మా, బొరుసు లాంటి పార్టీలు. కాబట్టి ప్రజలు బీజేపీని గెలిపించాలని కోరుతున్నాం.

**సీఎస్ఆర్ నిధులతో..**

**రూ.35లక్షల విలువైన యంత్రం!**

మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు శనివారం సంగారెడ్డి జిల్లా జనరల్ ఆస్పత్రికి వచ్చారు. ఇక్కడికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందేలా ఎన్టీపీసీ సహకారంతో రూ. 35లక్షల విలువైన డిజిటల్ ఎక్స్ రే యంత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఆయనకు, సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.







# మా కుటుంబానికి అండగా నిలుస్తున్న..
# బీఆర్ఎస్ పార్టీకి రుణపడి ఉంటాం!

- **మైనింగ్ అంశానికి సంబంధించి అక్రమ కేసులను ఎండగట్టారంటూ హరీశ్ రావును కలిసి కృతజ్ఞతలు తెలిపిన గూడెం మధుసూదన్ రెడ్డి**

**కందిలి, పటాన్ చెరు**

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పటాన్ చెరు ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి శనివారం డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమోదు చేసిన మైనింగ్ అక్రమ కేసుల గురించి అసెంబ్లీలో మద్దతుగా మాట్లాడినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అక్రమ మైనింగ్ పేరుతో తనపైన కేసులు నమోదు చేసి అర్ధరాత్రి అరెస్టు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ వైఖరిని రాష్ట్ర అసెంబ్లీలో కడిగి పారేసినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

**బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయాన్ని.. జీర్ణించుకోలే!**

ఈ సందర్భంగా గూడెం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలకు ఒక న్యాయం.. అధికార పక్షానికి మరో న్యాయం అందిస్తోందన్నారు. ద్వంద వైఖరిని అవలంబిస్తుందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ తరపున పటాన్ చెరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గూడెం మహిపాల్ రెడ్డి హ్యాట్రిక్ విజయాన్ని జీర్ణించుకోలేకే ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కక్షపూరిత చర్యలకు పాల్పడుతూ అక్రమంగా కేసులు బనాయించారన్నారు. మానసిక వేదనకు గురిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజం నిప్పులాంటిదని, ఏదో ఒక రోజు నిజం బయటపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, హరి పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ పార్టీకి... రుణపడి ఉంటాం!**

"ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పటాన్ చెరు ప్రజలు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే జీఎంఆర్ నాయకత్వానికి పట్టం కట్టారు. తన నిర్ణయాన్ని స్పష్టంగా ప్రకటించారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా బుద్ధి రాలేదు. మా కుటుంబానికి సంపూర్ణ మద్దతు అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఎల్లప్పుడూ రుణపడి ఉంటా"మని గూడెం మధుసూదన్ రెడ్డి తెలిపారు.

---





# యువత ఉత్సాహం చూస్తుంటే..
# భారత్ అగ్రగామిగా ఎదగడం ఖాయమనిస్తోంది!

- **విశ్వాసం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి**
- **హైదరాబాద్ వేదికగా నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ – 2026 కార్యక్రమానికి హాజరు**

**కందిలి, పటాన్ చెరు**

హైదరాబాద్ వేదికగా మేరా యువ భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ - 2026 యూనియన్ బడ్జెట్ అంశం మీద తెలంగాణ స్టేట్ లెవెల్ పోటీలకు పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, సమన్వయ కర్త రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీ అంజిరెడ్డి కామెంట్స్ ఇలా!**

- ఈ రాష్ట్ర స్థాయి వికసిత భారత్ యువ పార్లమెంట్ (State Level Viksit Bharat Youth Parliament) వేదికపై మీ ఉత్సాహాన్ని చూస్తుంటే, 2047 నాటికి భారత దేశం ప్రపంచ అగ్రగామిగా నిలబడటం ఖాయమనిపిస్తోంది.
- మన దేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం. కానీ ఈ యువత కేవలం జనాభాగా మాత్రమే కాకుండా, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి.
- యువ పార్లమెంట్ ఉద్దేశం కేవలం వాదోపవాదాలు చేయడం కాదు. ప్రజాస్వామ్య ప్రక్రియను అర్థం చేసుకుని, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలి.
- ప్రధాని నరేంద్ర మోదీ గారు గత 11 యేండ్లుగా దేశ అభివృద్ధి లో యువత భాగస్వామ్యం ను పెంచుతున్నారు.
- దేశ జనాభాలో అత్యధికంగా ఉన్న యువతకు విద్య, నైపుణ్యం, ఉపాధి కల్పించడమే లక్ష్యంగా విద్యా రంగానికి రికార్డు స్థాయిలో ₹1.39 లక్షల కోట్లు కేటాయించారు. క్వాలిటీ ఎడ్యుకేషన్ కు ప్రాధాన్యత పెరిగింది.
- దేశంలో 15 వేల స్కూళ్లు, 500 కాలేజీల్లో AVGC ల్యాబ్స్ ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్తులో యానిమేషన్, గేమింగ్ రంగాల్లో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చబోతున్నాం.
- ప్రతి జిల్లాలో గర్ల్స్ కోసం ప్రత్యేక హాస్టళ్ల నిర్మాణం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థినులు సైన్స్, టెక్నాలజీ రంగాల్లో రాణించే అవకాశం పెరుగుతుంది.
- విదేశీ విద్య కోసం పంపే నిధులపై TCS ను 5% నుంచి 2% కి తగ్గించడం మధ్యతరగతి తల్లి దండ్రులకు ఒక పెద్ద ఆర్థిక ఊరట లభిస్తుంది. దీనివల్ల విదేశాల్లో చదువుకోవాలనే కల మరింత సులభతరం అవుతుంది.







# సదాశివపేటలో...
# వైభవంగా శ్రీరామనవమి వేడుకలు!

సదాశివపేట పట్టణంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. సీతారాముల కళ్యాణం ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిజిఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, తూర్పు భరత్ సాయి రెడ్డి పాల్గొన్నారు. ఈ వేడుకలను వీక్షించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సీతారాములను దర్శించుకుని తన్మయత్వానికి లోనయ్యారు. దర్శనార్థం వచ్చిన భక్తులకు తూర్పు భరత్ సాయి రెడ్డి స్వయంగా తలంబ్రాలు అందించారు.









Printed by SAKETH PUBLICATIONS, Published by Surkanti Rajender Reddy on behalf of Surkanti Rajender Reddy. Printed at Sangareddy and Published at H.No. 5-8-134/8, Plot No.75, Chanakyapuri Colony, Near St.Anthony School, Sangareddy, Telangana- 502001, Editor: Surkanti Rajender Reddy, RNI. NO. TGTEL/25/A 1800. Ph.7036545130. Emai id: Kandilinews@gmail.com